# కథావేదిక

మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం

"అమ్మా మాధవీ!" అత్తగారి పిలుపు.

'అబ్బ... ఎంత తియ్యగా పిలుస్తోందో ఈవిడ నోట్లో పంచదార పోసుకున్నట్లు'... విసుగ్గా అనుకున్నాను. ఆవిడ మురిపెంగా చూసుకోవడం ఇదివరకు నాకు ఆనందం కలిగించేది. కానీ...కానీ...!

మా మామగారు పోయిన తరువాత అత్తగారు వ్యవసాయం చేయిస్తూ, పొలం ఇల్లు చూసుకుంటూ పల్లెటూళ్లోనే ఉండిపోయారు. నలభై రెండేళ్ల వయసులో భర్తను పోగొట్టుకుని ఎన్నో కష్టాలకోర్చి మమ్మల్ని పెంచిందంటూ భర్తా, బావగారూ, ఆడపడుచూ ఆవిడంటే ప్రాణం పెడతారు.

పంట డబ్బుగానీ, కాస్తో కూస్తో వచ్చే అద్దె డబ్బులుగానీ ఆవిడ ఏం చేస్తుందో ఎవరూ అడగరు. ఆవిడ కూడా ఎవర్నీ ఆర్థిక విషయాల్లో ఇబ్బంది పెట్టడం వుండదు. తను డబ్బుని ఎలా ఖర్చు చేస్తుందనే విషయంగానీ, లేక

## అత్తగారి అభిమానం

-తాడిమేటి శ్రీదేవి




పోతే ఎలా దాస్తోందనే విషయంగానీ ఎవరికీ చెప్పదు.

ఎవరింట్లో ఉన్నా ఆవిడ మందులు ఆవిడే తెప్పించుకుంటుంది. ఉన్న పది పదిహేను రోజులు ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండా వుంటుంది. చెయ్యగలిగినంత సాయం చేసి పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకుని చదివించడమో, కథలు చెప్పడమో చేస్తూ వుంటుంది. గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలన్నట్లు ప్రవర్తించడం, సంబంధంలేని విషయాల్లో జోక్యం చేసుకోకపోవడం ఆవిడ అలవాటు. ఏ రకంగానూ ఆవిడ నుండి ఇబ్బంది ఎదురవదు నాకు.


అత్తగార్లవల్ల పడే బాధలు, నిష్ఠూరపు మాటల గురించి ఎవరైనా చెబుతుంటే ఈవిడ ఇలా ఉండడం నా అదృష్టమనే అనుకునేదాన్ని. కానీ ఈమధ్య నా మనసులో ఆవిడంటే ఒకరకం అయిష్టత పెరుగుతూ వస్తోంది.

ఎదురింట్లో రజని వాళ్ళు వచ్చి దిగాక నా ఆలోచనలు మారసాగాయి. వాళ్ల ఇంట్లోగానీ, వాళ్ల బావగార్ల ఇళ్లల్లోగానీ ఎటువంటి ఫంక్షన్స్ అయినా లేక ఏదో సందర్భాన్ని పురస్కరించుకు వాళ్లత్తగారు ఏవో ప్రజెంటేషన్స్ ఇస్తూ



## గుర్తింపు

ఇటీవలి 'చంద్రముఖి' సినిమా ద్వారా రజనీకాంత్‌కి కొత్తగా లభించిన గుర్తింపు ఏమీ లేకపోయినా ఈ సినిమా ద్వారా ఎక్కువగా లాభపడింది జ్యోతిక. 'చంద్రముఖి'లో ఆమె నటనకు ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ సినిమా ఒరిజినల్ మలయాళ వెర్షన్‌లో నటించిన శోభనకు జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు లభించింది. మరి జ్యోతికకి కూడా నటిగా అవార్డుల్ని సంపాదించుకోవాలనే పట్టుదల వుందేమో, బుల్లితెరకోసం ఓ ఇరవై నిమిషాల ఆర్ట్ ఫిలింలో నటించడానికి జ్యోతిక అంగీకరించడం చర్చనీయాంశం అయింది.




వుంటుంది. ఒక్కోసారి పట్టుచీరలనో, వెండిగిన్నెలనో, మరోసారి ఖరీదైన ఫర్నిచర్... ఇలా ఏదో ఒకటి ఆవిడ ఇవ్వడం, రజని 'మా అత్తగారు ఇచ్చారంటూ' ప్రదర్శించడం మామూలైపోయింది. అవన్నీ చూస్తూ వుంటే నాలో ఈర్ష్య బయలుదేరేది.

నేనేనా ఇలా ఆలోచిస్తున్నాను? ఆడవాళ్లకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని విశ్వసించే నేను మా అత్తగారు తనంతట తాను డబ్బు మేనేజ్ చేస్తుంటే ఇలా ఆలోచించడం తప్పు కదూ అంటూ ఆత్మవిమర్శ చేసుకుంటూ వుండేదాన్ని. కానీ నా ఆశ అంతరాత్మ నోరు నొక్కేస్తోంది. ముఖ్యంగా రజని అత్తగారి ద్వారా పొందే బహుమతులు చూస్తుంటే నాలో అసూయ రోజురోజుకీ పెరిగిపోసాగింది.వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు. అందుకని అలా బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారని అనిపించినా 'మా అత్తగారికి మటుకు లోటేమిటి?' అని ప్రశ్నించుకోవడం అలవాటయింది.

ఆవిడకి పిల్లలు పండక్కి, పబ్బానికీ చీర పెడితే 'ఇంత ఖరీదు పెట్టి నాకెందుకురా ఇంట్లో ఉండేదానికి?' అని సున్నితంగా తిరస్కరిస్తుంది. ఇదివరకైతే 'ఈవిడ మరీ ఇంత నిరాడంబరురాలేమిటి బాబూ' అనిపించేది. ఇప్పుడు మాత్రం 'అవును మరి ఖరీదైన చీర తీసుకుంటే తను కూడా ఇవ్వాల్సి వస్తుందోనని భయం' అనిపిస్తోంది. కానీ నా భావాలు బయటపెట్టే సాహసం మాత్రం చేయలేదు. మావారికి ఆవిడపట్ల వున్న ప్రేమాభిమానాలు తెలిసి వున్న నేను ఆయన దగ్గర అటువంటి అభిప్రాయం బయట పెట్టడానికి భయపడ్డాను. అమ్మా వాళ్ల దగ్గర కూడా అనలేదు. ఎందుకులే వాళ్ల దగ్గరంటే ఏం ఉపయోగమని...! నా అనుమానమేమిటంటే ఆవిడ కూడబెట్టినదంతా మా ఆడపడుచుకు ధారాదత్తం చేస్తుందేమోననే.

పండుగలకి మా తోటికోడళ్లిద్దరికీ, ఆడపడుచుకూ ఒకేలాంటి చీరలు కొనడం మా అత్తగారి అలవాటు. ఇదివరలో అలా ఒకే డిజైన్ వేరు వేరు రంగుల చీరలు కట్టుకోవడం సరదాగా అనిపించేది.

"ముందు సుజాతని, మాధవిని తీసుకోనివ్వమ్మా! నాకన్నా చిన్నవాళ్ళు కదా' అంటున్న ఆడబడుచుని చూస్తే ఆశ్చర్యానందాలు కలగడం మానేసి 'ఆ...ఇవన్నీ పైపై వేషాలు. అందేవన్నీ గుట్టుగా అందుతూనే వున్నాయి' అని అనుకోసాగాను.

మా తోటికోడలి నవ్వు మొహం, ఆనందం చూసి 'ఈవిడో పిచ్చిమొహంది. వాళ్ల మాయలో పడిపోయింది' అనిపించింది. ఇదివరకులా మన స్ఫూర్తిలా కలిసిమెలిసి తిరగలేకపోతున్నాను.

"కాస్త పులిహోర తింటారేమో పెట్టమ్మా" పండగరోజు సాయంత్రం ఐదు గంటలవేళ అన్నారు మా అత్తగారు.

మావార్ని పిలుద్దామని వస్తూ ఆడబడుచు నోట్లోంచి నా పేరు వినబడి తక్కున తలుపు వెనుక తెలియకుండా నుంచున్నాను.

"బాగానే వుంటోందక్కా. పనులవీ బాగానే చేసుకుంటోంది" మావారి గొంతులో ఆశ్చర్యం తొంగి చూస్తోంది.

"ఏం బాగురా? నా మొహం బాగు. ఓ నవ్వూ తుళ్లూ లేదు. అమ్మ కూడా బాధపడుతోంది" మా ఆడబడుచు అంటోంది.

నా గురించి ఏమైనా చెప్తోందా ఈవిడ? అనుమానం బుస కొట్టింది. ఒళ్లంతా చెవులు చేసుకుని వినసాగాను.

"అదికాదురా. ఇన్నాళ్ళూ పండక్కి పిల్లలచేత బొమ్మల కొలువులూ, గొబ్బిళ్లూ పెట్టించాలంటూ హడావుడి పడేది. ఈసారి ఏం వద్దంటోంది. రేపో మాపో పిల్ల పెద్దమనిషి అయ్యిందంటే వచ్చే ఏడు గొబ్బిళ్ళు పెట్టించడం ఉండదు కదా."

'పెద్ద... చెప్పొచ్చింది. ఇదో పెద్ద నేరమా?'

ఆయన ఏమంటారోనని చెవులు రిక్కించాను.

"అలా అందా? అలాంటివన్నీ సరదాలేనే మరి. ఎందుకు వద్దందో?" ఆశ్చ

ర్యంగా అంటున్నారాయన.

"మాధవి కూడా కొంచెం ఓపిక లేనట్లుగా వుంటోందిరా. మునుపటి హుషారు లేదు. ఒకసారి డాక్టర్‌కి చూపిస్తే మంచిదేమో చూడు'' అడబడుచు సలహా. ఒక్కక్షణం 'పాపం...ఎంతలా చెప్తోందో?' అనిపించింది. మరుక్షణం 'ఆ..గాడిదగుడ్డు. ప్రపంచంలోని మంచితనమంతా వీళ్లిద్దరిలోనే పోగుపడిపోయినట్లు నాటకాలాడతారీ తల్లీకూతుళ్ళు?'' విసుగ్గా అనుకున్నాను.

"ఏం చేస్తున్నారు? పులిహోర తింటారా అంటున్నారు అత్తయ్యగారు'' అప్పుడే వచ్చినట్లుగా లోపలకు అడుగుపెట్టాను.

"అమ్మో! టైగర్ ఫుడ్డే. మధ్యాహ్నమే తెగ తినిపించేసిందమ్మ. కాసేపలా తిరిగి వస్తేగానీ రాత్రి దానికి న్యాయం చేయలేం'' అంటూ షర్టు వేసుకుంటూనే బయటకు నడిచారు ఆయన బావగారినీ, అన్నగారినీ పిలుచుకుపోవడానికి. పండుగ మూడురోజులూ ఆయనా, పిల్లలూ అందరితోటీ హాయిగా కాలక్షేపం చేసారు. నేను మాత్రం ముభావంగా ఉండిపోయాను.

***

"అమ్మా!'' మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ దివ్య పిలుపు.

భోజనం చేసి అప్పుడే నడుం వాల్చి పేపర్ తిరగేస్తున్న నేను దాని గొంతు విని ఉలిక్కిపడి లేచాను ఈ టైమ్‌లో స్కూలునుంచి వచ్చేసిందేమిటా అని.

ఆ వయసు ఆడపిల్లల తల్లులందరూ ఉత్కంఠగానూ, కొంచెం భయం భయంగానూ ఎదురుచూసే సమయం రానే వచ్చింది. కాసేపు ఏం చేయాలో తోచలేదు.

"ఉండు..ఉండు. ఇలా స్టూల్ మీద కూర్చో. ఏమీ ముట్టుకోకు'' అంటూ ప్రక్కింటి వర్ధనమ్మగారింటికి పరుగెత్తాను.

ఆవిడ వెంటనే చేతిలో పని వదిలేసి వచ్చారు. దివ్య కంగారుగానూ, అయోమయంగానూ చూస్తోంది.

"ఏం ఫర్వాలేదు. చిన్న ఫంక్షన్ అంతే'' ధైర్యం చెప్పాను.

దాని స్నేహితురాళ్లు ఇద్దరు ముగ్గుర్ని ఈ స్థితిలో చూసిన అనుభవం గుర్తుకొచ్చినట్టుంది. కొద్దిగా నవ్వొచ్చింది దాని మొహం మీదకి. వెంటనే ఆయన ఆఫీసుకి ఫోన్ చేసి విషయం చెప్పాను. ఆయన నాకంటే ఎక్కువగా కంగారుపడ్డారు "ఇప్పుడేం చేయాలంటూ!''

అమ్మావాళ్లకి, అత్తయ్యగారికీ ఫోన్లు చేసాము. వాళ్లు మర్నాటికిగానీ రాలేరు. ఆ రాత్రి నాకు కంటిమీద కునుకు లేదు. నెలరోజులక్రితం రజని కూతురు యామినికి పెళ్లంత హడావుడి చేసి ఘనంగా చేసిన ఫంక్షన్ కళ్ల ముందు కదలాడింది. వాళ్లంత కాకపోయినా సాధ్యమైనంత ఘనంగా చేయడానికి మావార్ని ఒప్పించాలని గట్టిగా నిర్ణయించుకుని కళ్ళు మూసుకున్నాను.

"నాన్నగారికి బిపి మరీ ఎక్కువగా వుంది. అప్పుడే రాలేను. పేరంటం పెట్టే రోజుకి వస్తాను. ఏమనుకోవద్దు'' అంటూ అమ్మ ఫోన్ చేసింది.

ఉసూరుమనిపించినా చక్కబెట్టవలసిన పనుల హడావుడిలో పడిపోయాను. అత్తగారు వచ్చారు. వంట అదీ చేస్తూ నాక్కాస్త వెసులుబాటు కలిగించింది ఆవిడ. స్నానం రోజున ఐదుగురి ముత్తయిదువులకు భోజనం పెట్టి పేరంటం పెట్టుకోవచ్చునని ఆవిడంటే నాకు అరికాలి మంట నెత్తికెక్కింది.

"ఏమంత గతి కడుక్కుపోయి ఉన్నామని? ఊళ్లో ఉన్న చుట్టాల్నీ, ఫ్రెండ్స్‌ని పిలిచి భోజనాలు పెట్టుకోవచ్చుకదా. ఒక్కగానొక్క ఆడపిల్ల'' గట్టిగానే అన్నాను. ఆవిడ ఏం మాట్లాడకుండా నావైపు ఓసారి చూసి తల దించుకున్నారు. ఎవరితోనూ వాదించడం, గట్టిగా మాట్లాడడం ఆవిడకు ఇష్టముండదు. ఆవిడ మౌనం నాలో మంట రేపుతోంది. బయటకు మాట్లాడితే మనసులో ఏముందో తెలుస్తుంది. 'అమ్మో! ఈవిడసలు కొరకరాని కొయ్య' కసిగా మనసులోనే తిట్టుకున్నాను. అనవసరపు ఖర్చులెందుకని వెనక్కు లాగుతున్న శ్రీవారిని నోరెత్తనివ్వకుండా అన్నీ నేననుకున్నట్లుగానే జరిపించాను.

అమ్మ వచ్చేటప్పుడు పట్టు పరికిణీ సెట్‌తోపాటు అరకాసు ఉంగరం తెచ్చి పెట్టింది. అత్తగారు ఐదువందలు పిల్ల చేతిలో పెట్టి దీవించారు.

'ఏమిటో ఈవిడ ఇలాంటి ఫంక్షన్స్‌కి కూడా పుట్టినరోజుకి ఇచ్చినట్లు ఇస్తుందేమిటి? ఎవరైనా చూస్తే సిగ్గు కూడాను' చిరాగ్గా అనుకున్నాను. చేసేదేమీలేక పళ్ళు నూరుకున్నాను. రజనికి చూపించేటప్పుడు అమ్మావాళ్ళు పెట్టినవి చూపించి "మా అత్తగారు డబ్బిచ్చారు. యూనిఫారంలమీద మంచి బట్టలు అనవసరం'' అని అన్నాను.

"ఆ డబ్బుతో ఏదైనా నగ చేయించేస్తేనే నయం మాధవీ. ఈమధ్య బ్యాంకు వడ్డీలు తగ్గిపోయాయి కదా'' అంటున్న రజని మాటలు విననట్లుగా ఏదో పని కల్పించుకుని ప్రక్కగదిలోకి వెళ్లాను.

***

## అందానికి చాక్లెట్ స్నానం

చాక్లెట్ ద్రవాన్ని ఒంటికి పట్టించుకుని మర్దనా చేయించుకుంటే చర్మ సౌందర్యం ఇబ్బడిముబ్బడి అవుతుందంటున్నారు ప్యారిస్ ఫిజియోథెరపిస్టులు. అందాలభామలకి వయస్సు తక్కువగా కనిపించడమేకాకుండా వాస్తవంగా ఏజింగ్ ప్రాసెస్ స్లో అయిపోతుందని ఆ నిపుణులు అంటున్నారు. ఈ ట్రీట్‌మెంట్ ఆరంభమైనాక ప్యారిస్ అందగత్తెలు చాక్లెట్ ద్రవంలో డైవ్ చేస్తూ రెండున్నర గంటలసేపు జలకాలాడుతున్నారుట. దీని కయ్యే ఖర్చు రెండువందల డాలర్లు.

## బొజ్జ తెచ్చే తంటా!

'మీ బొజ్జలు తగ్గించుకోండి. లేకపోతే ఉద్యోగాలు వదిలిపోండి' అంటున్నాడు రుమేనియాలో రుజ్జావు అనే టౌన్‌లో కొత్తగా చేరిన వయోరివ్ స్టైఫూ అనే పోలీస్ ఆఫీసర్. దొంగల్ని పట్టుకోవాలంటే వాళ్ళకంటే చాకుల్లా పరిగెత్తే పోలీసులు కావాలని ఆయన వాదన. తమబొజ్జలు తగ్గించుకోవాలని ఆ ఊరి పోలీసులంతా ఇప్పుడు రోజుకి ఐదుగంటలసేపు జిమ్‌లలో కసరత్తు చేస్తున్నారుట. అలాంటి పోలీసు అధికార్లు మనదేశంలో కూడా ఉంటే ఎంత బాగుండును.

-తటవర్తి




తమ్ముడి అత్తగారు పోయి సంవత్సరం అవుతోంది. మరదలికి 9వ నెల వచ్చింది. వాళ్ల అన్నా వదినా పుట్టింటికి పంపమంటున్నారుగానీ వాడికి ఇష్టం లేదు. అమ్మని వచ్చి ఉండమని గొడవ. అమ్మ వాళ్లతో ఢిల్లీ ప్రయాణమయింది పిల్లనో, పిల్లవాడినో తల్లి ఒడిలో పడేసి కాస్త బాలింత పత్యం చూసి వస్తానంటూ. కోతల రోజులు కావడంతో అత్తగారు కూడా రెండురోజుల్లో ప్రయాణం పెట్టుకున్నారు. మర్నాడు నాకు ఒళ్లెరగని జ్వరం. కళ్ళు తెరవడానికి వీల్లేకుండా భగభగ మండుతున్నాయి. తలమీద సుత్తులతో బాదేస్తున్నట్లు విపరీతమైన తలనొప్పి. ఒళ్లంతా చితకబొడిచినట్లుగా వుంది.

"ఏం మాధవీ! ఇంకా పడుకున్నావేమిటి? ఒంట్లో బాగాలేదా?'' అని అడుగుతూ చెయ్యి వేసిన ఆయన షాక్ తగిలినట్లు వెనక్కి లాక్కున్నారు. "అమ్మో! సడెన్‌గా ఇంత జ్వరం వచ్చిందేమిటి?'' అత్తగారిని పిలిచినట్లున్నారు.

ఆవిడ నెమ్మదిగా "పొంగు చూపినట్లుందిరా'' అనడం వినబడింది.

తరువాత ఇంక స్పృహలో లేను. మర్నాడు కొంచెం మెలకువ వచ్చింది.



## వెరైటీ

సన్నీ డియోల్ సినిమాలు వెరైటీగా ఉంటాయన్నది అందరికీ తెలిసిందే. సన్నీడియోల్ ఈమధ్య మంచి పెర్‌ఫార్మెన్స్ ఉన్న పాత్రలంటే తనకెంతో ఇష్టమని చెప్పాడు. దామిని, జోబోల్‌సే నిహాల్ వంటి చిత్రాల్లో నటించిన ఈనటుడు ఈమధ్య చాలా బాగా తన బాడీని పెంచేశాడు. కొత్తదనం ఎక్కడుంటే అక్కడ ప్రేక్షకులుంటారని నమ్మే సన్నీడియోల్ తన చేతివేళ్ళే తన హావభావాల్ని బాగా పలికిస్తాయంటున్నాడు. ఫింగర్ పవర్ అంటే ఇదేనేమో!




ఆయన ఏవో హోమియో మందులు తెచ్చి వేస్తున్నారు. అత్తయ్యగారు వేపమండలతో విసరడం, సాంబ్రాణి ధూపం వేయడం సమస్తం ఎంతో ఓపిగ్గా చేస్తున్నారు. తల్లిచేత కూడా చేయించుకోవడానికి సిగ్గుపడే ఎన్నో సపర్యలు సొంత కూతురికన్నా ఎక్కువగా చేస్తుంటే నా కళ్లవెంట నీళ్ళు తిరిగేవి.

కొంచెం ఓపిక వచ్చిన తరువాత "మీరు ఊరు వెళ్లడం అవలేదు పాపం మంచి కోతల టైమ్‌లో'' నెమ్మదిగా అన్నాను.

"మరేం ఫర్వాలేదులే. మన ప్రక్కింటి రామనాథంగారికి అబ్బాయి చేత ఫోన్ చేయించాను. ఆయన చూసి వెడతాడు. నువ్వేం ఆలోచించకు. కాసేపు పడుకో. ఆకలి వేస్తోందా? ఏమన్నా తాగుతావా?'' అడిగారు.

కాసేపయ్యాక తాగుతానని చెప్పి కళ్ళు మూసుకున్నాను.

నా కళ్లముందు నాలుగునెలల క్రితం జరిగిన సంఘటన కదలాడింది. రజని వాళ్లాయన క్యాంప్‌కి వెళ్లినప్పుడు తను మెట్టుమీద జారిపడి నడుం విరిగినంత పనయ్యింది. విపరీతమైన నొప్పితో గిలగిలలాడిపోయింది. అంతకు పదిరోజుల క్రితం నుంచి ఇంట్లోనే వున్న వాళ్లత్తగారు, ఆడపడుచు మనవడి బారసాలకు వెళ్లాలంటూ జెండా ఎత్తేసింది. పనిమనుషులు మాట వినక, పిల్లలకి పనులు అలవాటులేక నానా అవస్థా అయింది తనకు. వాళ్లయన వచ్చేవరకు నేనే సాయం చేసాను. వాళ్లమ్మగారికి కబురు చేద్దామంటే ఆవిడ రజని అన్నగారి దగ్గర స్టేట్స్‌లో ఉన్నారు. రెండురోజులు సొంత మనవలకి వండిపెట్టుకోవడానికి ఈవిడకింత బాధేమిటి అనిపించింది అప్పుడు. కానీ ఆవిడ కోడలికిచ్చే బహుమతులు నా కళ్లు కప్పేసాయి. 'ఆవిడకీ, మా అత్తగారికి ఎంత తేడా' అనుకోకుండా ఉండలేకపోయాను.

నేను లేచి కులాసాగా తిరిగేసరికి ఇంట్లో అన్నీ సిస్టమేటిగ్గా జరుగుతూ ఉండడం చూసి ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను. మా పిల్లలిద్దర్నీ గారంగా చూసుకోవడం తప్ప పనులు చెప్పేదాన్ని కాదు నేను. ఎప్పుడైనా చెప్పినా వాళ్లూ విసుక్కునేవారు. ఇప్పుడు మా అమ్మాయి చక్కగా వాళ్ల బామ్మగారికి కావలసినవన్నీ అందిస్తూ వాళ్ల నాన్నకి, తనకు, తమ్ముడికి క్యారియర్లు సర్దడం నేర్చుకుంది. బాబు వాటర్ బాటిల్స్‌లో నీళ్లు పోసి ఎవరి బ్యాగుల్లో వారివి పెట్టడం, చక్కగా బుక్స్ సర్దుకోవడం, బూట్ పాలిష్ చేసుకోవడంలాంటివన్నీ చేసుకుంటున్నాడు. ఈయన కూడా మడత పెట్టిన బట్టల్ని బీరువాలో సర్దుకోవడం, ఫ్రిజ్‌లో కూరలు నీట్‌గా సర్దడం, 'ఏం కావాలమ్మా' అని అడిగి సరుకులు తెచ్చిపెట్టడం చేస్తున్నారు. ఆయనకి మొదట్నుంచీ ఎక్కడ వస్తువులు అక్కడ పెట్టడం అలవాటు. పిల్లలు అలా చేయకపోతే కోప్పడేవారు. ఇప్పుడు మిగిలిన పనులు కూడా అందుకుంటున్నారు. ఇదంతా మా అత్తగారు వారం పదిరోజుల్లో ఎవరిమీద కేకలు వేయకుండా, విసుగు చెందకుండా చక్కగా సాధించారు. అవన్నీ మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాను.

"అమ్మయ్య... నీకు నచ్చిందన్నమాట ఈ పాతకాలపుదాని పని'' అంటూ నవ్వేసారు.

"మీరిప్పుడు చేసిన సాయమే కాకుండా నేను ఎప్పటికీ సుఖపడేలా వీళ్లకి పనులన్నీ నేర్పారు. చాలా సంతోషంగా ఉంది'' అన్నాను.

మర్నాడు బావగారి దగ్గర నుండి ఫోన్. వాళ్ల కొలీగ్ కూతురు పెళ్లిట. ఎలాగూ వస్తున్నాను కదా. సుజాతను కూడా తీసుకు వస్తున్నాను. మాధవిని చూసి వెళదామనుకుంటున్నాను'' అంటూ.

***

"ఎంతలా చిక్కిపోయావు మాధవీ. ఇప్పుడెలా వుంది?'' అంది మా తోటి కోడలు నా చెయ్యి ఆప్యాయంగా పట్టుకుంటూ.

"ఇప్పుడు చాలావరకు నయమక్కా. అత్తయ్యగారు లేకపోతే నేనేమైపోయేదాన్నో'' అన్నాను ఆవిడవైపు కృతజ్ఞతగా చూస్తూ.

"ఎప్పుడు చూసినా అదేమాట సుజాతా. ఒకరికొస్తే మరొకరు చేసుకో

వడం పెద్ద గొప్ప విషయమా?'' అన్నారావిడ.

ఆవిడ అలా తీసేసినా అదెంత గొప్ప విషయమో నాకు అనుభవపూర్వకంగా తెలిసింది. రాత్రి పదయినట్లుంది. నీరసం మీద మాగన్నుగా నిద్ర పట్టిన నాకు అప్పుడే మెలకువ వచ్చింది.

"జ్వరంపడి లేచావు. పెందరాళే తింటే అరుగుతుంది. లేకపోతే కష్టం'' అంటూ మా అత్తగారు నాకు ఆరున్నరకే భోజనం పెట్టేస్తున్నారు. పిల్లల మాటలేవీ వినబడడంలేదు. నిద్ర పోతున్నట్లున్నారు. పెద్దవాళ్లందరూ అప్పుడే భోజనం చేసి హాల్లోకి వచ్చి మాట్లాడుకుంటున్నారు.

"చూడండర్రా! నేనో విషయం చెప్పాలనుకుంటున్నాను'' అత్తగారి మాటలు వినిపించాయి.

ఒక్క నిముషం నిశ్శబ్దం.

"సరళ డిగ్రీ కావస్తోంది కదా. రవి ఇంటర్ చదువయిపోతుంది మరో రెండు నెలల్లో. దివ్యకి వచ్చే ఏటికి హైస్కూల్ చదువయిపోతుంది. సునీల్ ఇంకా చిన్నవాడనుకోండి. సరళకి, పెళ్లో, పై చదువో చూడాలి. రవిని మంచి చదువుల్లో ప్రవేశపెట్టాలి. దివ్యకి మళ్లీ సంవత్సరం మంచి కాలేజీలో చేర్పించే సంగతి ఆలోచించాలి. అవునా?''

నాకు ఆశ్చర్యమేసింది. మావారు, బావగారు, తోటికోడలు కూడా అదే స్థితిలో ఉన్నట్టున్నారు. ఎవరి మాటా వినబడలేదు. ఆవిడ కొనసాగించారు.

"ఇన్నాళ్లూ వంట డబ్బు, అద్దెలు నేనేం చేస్తున్నానో మీరెవరూ అడగలేదు. నామీద నా పిల్లలకి ఉన్న నమ్మకానికి ఎంతో సంతోషంగా వుంది. కానీ ఇప్పుడు చెప్పాల్సిన సమయం వచ్చింది. తిండిగింజలకి సరిపడా వుంచి మిగిలిన వంట డబ్బులన్నీ రామనాథం మామయ్యగారి చేత బ్యాంకులో జమ చేయిస్తూ వచ్చాను. అలాగే అద్దె డబ్బులూనూ. మొత్తం నాలుగు లక్షలపైనే ఉండవచ్చు. మీరు ఆ డబ్బుని పిల్లల విషయంలో ఖర్చు పెట్టుకోవచ్చును. మళ్లీ ఇలాగే జమ చేస్తూ వుంటే దివ్య పెళ్లికి, సునీల్ పై చదువులకి పనికి వస్తుంది. మీ సంపాదనలు మీకున్నాయి. మీ పిల్లల సంగతి మీరు చూసుకోలేరని కాదు. కానీ ఈ పిత్రార్జితం మీకు వేన్నీళ్లకు చన్నీళ్ల సాయం అవుతుందని. నేనున్నా లేకపోయినా మీరిలా చేసుకుంటే మంచిదని నాకు తోస్తోంది.''

"అదేంటమ్మా?'' మావారు, బావగారు ఒక్కసారే అన్నారు.

"అలాంటి మాటలు అనకండి అత్తయ్యగారూ'' మా తోటికోడలు ఆప్యాయంగా అంటోంది.

నాకు దుఃఖం గొంతులో ఉండలా అడ్డు పడుతోంది. ఎంతగా అపార్థం చేసుకున్నానావిడను. పుడకలు చేర్చి గూడు కట్టిన పక్షిలా పిల్లల పిల్లల కోసం ఎంతలా కూడబెట్టింది ఈవిడ.

"నేనెక్కడికి పోతానమ్మా మునిమనవల్ని ఎత్తకుండా. మాట వరసకి అంటున్నా అంతే. అందర్నీ చూసి అనవసరపు ఆడంబరాలకి పోతారేమోనని ఇన్నిరోజులూ నేను కట్టడి చేసినట్లు చేసానంతే. డబ్బెక్కువ ఆడుతుంటే పిల్లల్లో కష్టపడే లక్షణం కరువైపోతుందనేవారు మా నాన్నగారు. నేనది అక్షరాలా నిజమని నమ్ముతున్నాను. ఏ లోటూ లేకుండా ఉందాం. కానీ అనవసరపు ఖర్చులేవీ వద్దు. మరో ముఖ్య విషయం. అక్కయ్యకు అరెకరం పొలం ఇద్దామనేవారు మీ నాన్నగారు. అందుకని ఆ అర ఎకరం పొలం మీద వచ్చిన మిగతాది విడిగా ఉంచి దాని పిల్లకి నగలు చేయించడానికి అట్టే పెడుతున్నాను. అక్కయ్యకి ఎప్పుడు డబ్బు అవసరం అనుకుంటే అప్పుడు మనం ఆ అరెకరం ఇచ్చేయాలి. ఆడపిల్ల ఏడాదికి ఓమాటో రెండుమాట్లో గుమ్మంలోకి వచ్చినప్పుడు చీరా, జాకెట్ గుడ్డా పెట్టి కాస్త పసుపు కుంకం చేతిలో పెట్టడం మర్చిపోకండి. మజ్జిగలో ఎంత వెన్న తీసినా కొంచెం మిగిలినట్లు ఆడవాళ్లకి పుట్టింటిమీద ఆశ పోదంటారు.''

"అదేంటమ్మా అలా అంటావు. అక్కయ్య కన్నానా మాకు?'' అన్నారు వాళ్లు.

"నాకు తెలుసురా. మీ పిల్లలు అందరూ ఎప్పుడు ఎంత వయసొచ్చినా పెదనాన్న, పెద్దమ్మ, అత్తయ్య, బాబయ్య, పిన్ని అనే బంధాలు మర్చిపోకుండా ఉండాలని నా కోరిక. కనీసం ఏడాదికి ఒకసారైనా కలుసుకుని కష్టసుఖాలు కలబోసుకోవాలి. నేనున్నా లేకపోయినా ఈ ప్రేమాభిమానాలు కలకాలం ఇలాగే ఉండాలని చెప్తున్నా'' అన్నారావిడ.

"అదిగో మళ్లీ అదే మాట. అలా మాట్లాడకండి అత్తయ్యగారు'' ఈసారి మా తోటికోడలు కొంచెం గట్టిగా అంది.

"సర్సరే! ఇంక లేవండి. పొద్దుపోయింది'' అంటూ లేచి "మాధవికి తాగడానికి కాస్త ఏమైనా ఇయ్యమ్మా సుజాతా. పెందరాళే భోజనం చేసింది కదా. నీరసం వస్తుందేమో'' అంటున్నారు మా అత్తగారు.

ఆవిడ అభిమానానికి నా కళ్ళు నీటి చెలమలయ్యాయి.

★



## భలే మంచి అవకాశం

ఆమధ్య ఆత్మహత్యాయత్నంతో వార్తలకెక్కిన ఆర్తీ అగర్వాల్‌కి ఇప్పుడు తెలుగులో అవకాశాలు అంతగా లేవు. దాంతో ఆమె తన దృష్టిని తమిళ రంగం వైపు మళ్లించిందని తాజా సమాచారం. అదలా వుంచితే- తెలుగులో ఆమెకి ఇప్పుడో మంచి అవకాశం వచ్చింది. కెమెరామాన్‌గా ఎంతో ప్రసిద్ధుడయిన వి.ఎస్.ఆర్.స్వామి తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో ఆర్తీని కథానాయికగా ఎన్నుకోనున్నట్టు చెబుతున్నారు. అనుభవం, అభిరుచి వున్న వి.ఎస్.ఆర్.స్వామి తీసే చిత్రంలో చాన్స్ లభించడం అంటే కెరీర్‌కి ప్లస్సంటున్నారంతా.

